### ఆదివాసీల భూమి బదలాయింపు సమస్య

# I ఆఫ్ 70' రద్దుకు మళ్లీ ప్రయత్నాలు

ఒక చట్టాన్ని పంవత్సరాల తరబడి అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తే కొన్నాళ్ళకు ఆ చట్టం ఏ పరిస్థితిని సవరించాలని కోరుకుంటుందో ఆ పరిస్థితి మరింత స్థిరంగా సమాజంలో నెలకొంటుంది. అప్పుడు అదే సహజమయిన స్థితిగా కనిపిస్తుంది. దానిని సవరించాలని కోరుకునే చట్టమే అసంబద్ధంగా, అర్ధరహితంగా కనిపిస్తుంది. దానినిక తొలగించడానికి భూమిక సిద్ధమవుతుంది.

దీనికి చాలా ఉదాహరణలు ఇయ్యవచ్చును కానీ అన్నిటికంటే బలమయినది ఆదివాసీల భూమిని ఇతరులకు బదలాయించడాన్ని నిషేధించే చట్టానికి కాలక్రమంలో పట్టిన గతి. షెడ్యూల్డు (లేక ఏజెన్సీ) ప్రాంతాలలో ఆదివాసీల భూములను బయటి వారు కొనడానికి వీలులేదని చెప్పే చట్టం ఈ నాటిది కాదు. రాష్ట్రంలోని బ్రిటిష్ పాలిత ప్రాంతంలో 1917 నుండి, తెలంగాణాలో 1937 నుండి ఈ నిషేధం చట్టరూపంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత 1959లో ఈ రెండింటినీ విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు నియంత్రణ చట్టాన్ని (క్లుప్తంగా ఎల్.టి.ఆర్. ఆక్ట్ అంటారు.) రూపొందించారు. దానికి ఆచరణాత్మక రూపం ఇస్తూ 1970లో సవరణ చేసారు. (ఈ సవరణను రెగ్యులేషన్ I ఆఫ్ 1970 అంటారు.)

ఇన్ని చేసినా ప్రస్తుత పరిస్థితి ఏమిటంటే గిరిజనుల సంక్షేమం కోసం షెడ్యూల్డు ప్రాంతాలుగా వర్గీకరించబడిన ప్రాంతంలో చాలా చోట్ల గిరిజనులనే వాళ్లే కంటికి కనిపించరు. వాళ్ల భూములనే కాదు గూడెములను సహితం బయటి వాళ్లు విస్తృతంగా ఆక్రమించుకున్నారు. భద్రాచలం డివిజన్ వంటి దట్టమయిన అడవిగల షెడ్యూల్డు ప్రాంతంలో 1981 జనాభా లెక్కల నాటికే 2,20,000 జనాభాలో 1,20,000 గిరిజనేతరులు. మొత్తం రాష్ట్రంలోని షెడ్యూల్డు ప్రాంతాలలో సగం కంటే ఎక్కువ జనాభా గిరిజనేతరులే కాక, సాగుభూమిలో 57 శాతం అధికార లెక్కల ప్రకారం గిరిజనేతరుల యాజమాన్యంలో ఉంది. అధికార లెక్కల ప్రకారం గిరిజనుల యాజమాన్యంలో ఉండి అనధికారికంగా బయటి వాళ్ల అనుభవంలో ఉన్న సాగుభూమిని కూడా లెక్కగడితే షెడ్యూల్డు ప్రాంతాలలో 75 లేక 80 శాతం సాగుభూమి గిరిజనేతరులదేనేమో!

అసంబద్ధమయిన ఈ పరిస్థితి ఫలితంగా ఇప్పుడు చట్టమే అసంబద్ధంగా కనిపిస్తుంది. ఒక్క గిరిజన కుటుంబం సహితం లేని విశాల భూభాగం షెడ్యూల్డు ప్రాంతాలలో ఉంది. అక్కడ గిరిజనులకు తప్ప వేరే ఎవ్వరికీ భూములు అమ్మరాదని ఎల్.టి.ఆర్. చట్టం అంటుంది. ఉన్నదంతా గిరిజనేతరులే అయినప్పుడు ఈ చట్టానికి మతి ఉందా లేదా అని రైతులు ప్రశ్నిస్తారు. భూములు అమ్ముకోవాలన్న కోరికకు ఎన్నో కారణాలుంటాయిగానీ 'పిల్ల పెళ్లి కోసం' అనేది సెంటిమెంటల్ కారణం కాబట్టి "పిల్లకు పెళ్లి చేద్దామని ఒక ఎకరం అమ్ముకుందామంటే ఈ సర్కారు అమ్మనియ్యదు' అంటారు.

పైన పేర్కొన్నట్టు గిరిజనుల భూముల బదలాయింపును నిషేధించే చట్టాలు రాష్ట్రంలో 1917 నుండి ఉన్నాయి. వీటికి పదును పెట్టే తుది రూపం ఇచ్చింది రెగ్యులేషన్ I ఆఫ్ 1970. దీని ఫలితంగా:

–షెడ్యూల్డు ప్రాంతాలలో భూమినిగాని ఇతర స్థిరాస్తిని గానీ గిరిజనులకు తప్ప వేరొకరికి అమ్మడానికి వీలు లేదు. ఒకవేళ గిరిజనులు కొనుక్కోడానికి సిద్ధంగా లేకపోతే ఆ స్థిరాస్తివి ప్రభుత్వానికి అప్పగించాలి. ప్రభుత్వం తగినంత మూల్యం చెల్లిస్తుంది.

–గిరిజనేతరులు గిరిజనుల నుండి ఆక్రమించుకొన్న భూమిలో 1963 కంటె ముందు నుండి ఉన్నదానిని మినహాయించి మిగిలిన భూమి తిరిగి గిరిజనులకే దక్కుతుంది. గిరిజనేతరుల ఆధీనంలో ఉన్న భూమి 1963 కంటె ముందు నుండి ఉందని రుజువు చేసుకునే బాధ్యత, లేదా గిరిజనుల నుండి ఆక్రమించుకున్నది కాదని రుజువు చేసుకునే బాధ్యత, గిరిజనేతరులదే. ఇందులో మొదటి అంశం "పిల్ల పెళ్లికో" లేక ఇతర అవసరానికో తప్పక భూమి అమ్ముకోవలసిన గిరిజనేతరులకు ఒక మార్గాన్ని సూచిస్తుంది. కాబట్టి గిరిజనేతరులకు భూములు బదలాయించకూడదన్న నిషేధం నిజంగా బాధించేది అమ్ముకోదలచుకున్న వాళ్లను కాదు. కొనుక్కోదలచుకున్న వాళ్లను: సారవంతమయిన అడవి భూములను తమకంటె చిన్న రైతుల యినవారి నుండి కొనుగోలు చేసి పెద్ద మొత్తంలో భూమిని స్వాధీనం చేసుకోవాలనుకునే వాళ్లకు ఈ చట్టం నిజంగానే ఒక ఆటంకం.

రెండవ అంశాన్ని కొంచెం వివరంగా పరిశీలిద్దాం. దీని ఫలితంగా పాత ఆక్రమణదారుల సంగతి ఎట్లాగున్నా 1963 తరువాత ఆక్రమించుకున్న భూమిని తిరిగి గిరిజనులకు ఇప్పించే అవకాశం చట్టపరంగా దక్కింది. దీని క్రింద కొన్ని వందల దావాలు రెవెన్యూ అధికారుల కోర్టులలో నడిచాయి, నడుస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికి 80వేల ఎకరాల భూమిని గిరిజనులకు తిరిగి ఇప్పించింది. కానీ చెప్పుకోవలసిన విషయం ఏమిటంటే ఇప్పటికి పరిష్కారమయిన దావాలలో సగంకంటె ఎక్కువ గిరిజనేతరులకు అనుకూలంగా పరిష్కారమయ్యాయి!

ఈ చట్టానికి గండికొట్టడానికి గిరిజనేతరులు అనేక మార్గాలు అనుసరించారు. 1972 నుండి 1988 వరకు ఈ రెగ్యులేషన్‌ను సవాలు చేస్తూ అనేక సార్లు కోర్టుకుపోయారు. రెవెన్యూ యంత్రాంగం పైన ఒత్తిడి తెచ్చి చట్టం అమలు కాకుండా చూసారు. షెడ్యూల్డు ప్రాంతాలలో ఉన్న గ్రామాలను డీ షెడ్యూల్ చేయించారు. అంటే షెడ్యూల్డు ప్రాంతాల నుండి తొలగింపచేసారు. బూటకపు అమ్మకపు పత్రాలు సృష్టించి 1963 కంటె ముందే కొన్నట్టు సాక్ష్యం పుట్టించారు. గిరిజన స్త్రీలను పెళ్లి చేసుకోవడం ద్వారాను గిరిజన బాలురను బూటకంగా దత్తత తీసుకోవడం ద్వారాను, తమ ఆక్రమణను వారి పేరు మీద కొనసాగించారు.

విడివిడిగా జరిగిన ఈ ప్రయత్నాలు చాలక ప్రభుత్వం పైన ఒత్తిడి తెచ్చి అసలు చట్టాన్నే లేకుండా చేయాలని ప్రయత్నించారు. 1978లో చెన్నారెడ్డి ప్రభుత్వం జి.వో.ఎం.ఎస్. 129 అనే ఉత్తర్వు జారీ చేస్తూ 5 ఎకరాల మాగాణి లేక 10 ఎకరాల మెట్టభూమి వరకు ఉన్న గిరిజనేతరుల భూమికి రెగ్యులేషన్ I ఆఫ్ 1970 వర్తించదని-అంటే వాళ్లొకవేళ

1963 తరువాత ఆ భూమిని గిరిజనుల నుండి ఆక్రమించుకొని ఉన్నా దానిని తిరిగి గిరిజనులకు ఇప్పించకూడదని అనింది. చిన్న రైతులేకాక చాలామంది పెద్ద రైతులు సహితం దీనివల్ల లాభపడ్డారు. అయితే 1983లో రాష్ట్ర హైకోర్టు జి.వో.ను కొట్టేసింది. సుప్రీం కోర్టు కూడ రెగ్యులేషన్ I ఆఫ్ 1970ని తప్పక అమలు చేయాలని 1988లో తీర్పు ఇచ్చింది.

అయినా రెగ్యులేషన్ 'I ఆఫ్ 1970కి పైన పేర్కొన్న జి.వో. వంటి సవరణలు కాక మొత్తంగా రద్దే చేయాలన్న ప్రయత్నం వివిధ రాజకీయ పార్టీల మద్దతుతో సాగుతూ ఉంది. తెలుగుదేశం హయాంలో ఒకసారి ఈ ప్రతిపాదన వచ్చింది. అయితే దానికి చాలా ప్రతిఘటన రాగా ఎన్టీర్ ఆ ఆలోచన విరమించుకున్నాడు. 1989 ఎన్నికలలో ఓడిపోయే ముందు చట్టం రద్దుకు ప్రత్యామ్నాయంగా షెడ్యూల్డు ప్రాంతాలలో విస్తారంగా డీషెడ్యూలింగ్ చేస్తానని బెదిరించాడు. గెలిస్తే ఏం చేసేవాడో గానీ ఓడిపోవడం వల్ల ఆ ప్రతిపాదన తాత్కాలికంగా అటక ఎక్కింది. కానీ ఈ మధ్య మళ్లీ రెగ్యులేషన్ I ఆఫ్ 1970ని రద్దు చేసే ఆలోచన ముందుకొస్తూ ఉంది.

'జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు ఉన్న వాస్తవాన్ని గుర్తించి అర్థరహితమయిన అవరోధాలను తొలగించడం మంచిది' అని ఈ ప్రయత్నాన్ని సమర్థించే వారు వాదిస్తారు. షెడ్యూల్డు ప్రాంతాలలోని గిరిజనేతరులలో చిన్న రైతులు చాలా మంది ఉన్నారనీ, వారందరినీ తమ భూములు 1963 తరువాత గిరిజనుల భూములు ఆక్రమించుకోవడం ద్వారా సంక్రమించినవి కావని రుజువు చేసుకొమ్మనడం సబబు కాదనీ వాదిస్తారు. వారి భూముల క్రయ విక్రయాలపైన నిషేధం ఉండడం ఇబ్బందికరమే కాక వ్యవసాయ పురోభివృద్ధికి ఆటంకం అని కూడా వాదిస్తారు.



షెడ్యూల్డు ప్రాంతాలలోని గిరిజనేతర రైతాంగంలో చిన్న రైతులు చాలా మంది ఉన్న మాట వాస్తవమే. వారిలో చాలామంది అడవి నరికి భూమి సంపాదించుకున్నారు తప్ప గిరిజనుల నుండి ఆక్రమించుకోలేదన్నది కూడా వాస్తవమే. వారి సమస్యల పట్ల సానుభూతి ఉండవలసిందే. అయితే మన సానుభూతి మీద మొదటి హక్కుదార్లు సర్వస్వం అతి వేగంగా కోల్పోతున్న గిరిజనులు. 'చిన్న రైతుల' పేరిట భూమి బదలాయింపు నిషేధ చట్టాన్ని సడలించినా లేక కొట్టివేసినా షెడ్యూల్డు ప్రాంతాలలో ఇంకా గిరిజనులకు మిగిలి వున్న హక్కులకు గండి కొట్టడం అవుతుంది.

ఆ ప్రయత్నం చేసే బదులు ప్రభుత్వం రెగ్యులేషన్ Iఆఫ్ 70 ని సంపూర్ణంగా, వేగంగా అమలు చేసి, గిరిజనుల నుండి బయటి వాళ్ల ఆక్రమించుకున్న భూములను తిరిగి ఇప్పిస్తే, ఆ తరువాత ఇతరత్రా భూములు సంపాదించుకున్న గిరిజనేతరులకు భద్రత కల్పించవచ్చు. దీనివల్ల భూములు కోల్పోయే గిరిజనేతర చిన్న రైతులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ జీవన వసతి కల్పించాలి తప్ప వారి పేరు చెప్పి గిరిజనులచేతిలో ఇంకా మిగిలివున్న భూమి మొత్తం చేతులు మారే చట్ట సవరణలు చేయకూడదు. అయినా 'చిన్న రైతుల' గురించి మాట్లాడేవి వట్టి మాటలే. అసలు కాపాడేది పెద్ద రైతుల ప్రయోజనాలను.

మన రాష్ట్రంలో అనేక గిరిజన పోరాటాలు నడిచాయి నడుస్తున్నాయి. కొత్తగా విద్యావంతులవుతున్న గిరిజన యువకులు తమ ప్రజ స్థితిగతులగురించి ఆలోచిస్తున్నారు. ఆవేదనచెందుతున్నారు. 'I ఆఫ్ 70' ని రద్దు చేయాలని ఒక వైపు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుండగా మరొక వైపు గిరిజన ఉద్యమాలు, చైతన్య వంతులయిన గిరిజన యువకులు 'I ఆఫ్ 70' ని దాటి చాలా లోతులలోకి పోయే ప్రశ్నలు వేస్తున్నారు.

గిరిజనుల భూములు ఇతరులకు బదలాయించకూడదన్న శాసనం బ్రిటిష్ పాలిత జిల్లాలలో 1917 నుండి, తెలంగాణాలో 193[illegible] నుండి ఉండగా, బదలాయించిన భూములను తిరిగి ఇప్పించడానికి 1963ను 'I ఆఫ్ 70' ఎందుకు ప్రమాణంగా తీసుకుంది? అంతకు ముందు బదలాయించింది కూడా చట్ట విరుద్ధమే కదా! గిరిజనేతరుల ఆక్రమణ ఒకవైపు ఉండగా మరొకవైపు అటవీ శాఖ తన బుద్ధికి తోచిన భూభాగాన్నంతా రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించి అక్కడ దశాబ్దాలుగా నివసిస్తూ వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులను తరిమేస్తూ ఉంది కదా, మరి గిరిజనులు ఎట్లా బ్రతకాలి? షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అభ్యున్నతి ప్రభుత్వం మీద రాజ్యాంగం ప్రత్యేకంగా పెట్టిన భారం కాగా, ప్రభుత్వం ఎంతసేపూ 'I ఆఫ్ 70' వంటి పరిమితమయిన సంరక్షక శాసనాల వల్ల సహితం ఇతరులకు జరిగే నష్టాన్ని గురించే ఆలోచిస్తుంది తప్ప గిరిజనుల సంగతి ఎందుకు ఆలోచించదు? సంప్రదాయకంగా తమదయిన అటవీ భూభాగంలో మైనారిటీ అయిపోయి అక్కడి భూమి యాజమాన్యంలో అత్యల్ప మైనారిటీ అయిపోయి అటవీశాఖ అడవుల పైన నెలకొల్పిన గుత్తాధిపత్యం వల్ల తమ నేలలో తామే నేరస్తులమైపోయిన ఆదివాసీల గురించి ముందు ఆలోచించాలా అవసరం లేదా? భూమికి వారిని దూరం చేసి ఐ.టి.డి.ఎ. పేరిట ఇళ్లు ఎన్నికట్టిచ్చినా స్కూళ్లు ఎన్ని నెలకొల్పినా వృత్తి విద్యా కేంద్రాలెన్ని ఆవిష్కరించినా దానివల్ల ఆదివాసీలు పొందగల ప్రయోజనం స్వల్పమే కదా? 'I ఆఫ్ 70' కింద కోర్టులలో కేసులు అధికభాగం గిరిజనేతరులకు అనుకూలంగా ఎందుకు పరిష్కారమవుతున్నాయి? ఒకవైపు అటవీ ప్రాంతంలో గిరిజనులు నక్సలైట్ల మద్దతుతో అక్రమంగా దాదాపు 5 లక్షల ఎకరాల భూమిని నరికి సాగు చేసుకుంటున్నారని ఆరోపించే ప్రభుత్వం తన చట్టాల ద్వారా కేవలం 80వేల ఎకరాలు గిరిజనేతరుల నుండి గిరిజనులకు ఇప్పించగలిగిందంటే దాని అంతర్యం ఏమిటి? 'I ఆఫ్ 70' వంటి చట్టాలు ఎందుకు అమలు కావడం లేదు? మాటిమాటికీ వాటిని రద్దు చేసే ప్రయత్నాలు ఎందుకు జరుగుతున్నాయి?

ఆదివాసీలు అడుగుతున్న ఈ ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర జవాబు ఉందా?

(డా॥ బి. జనార్ధనరావు రాసిన 'ఆదివాసీ గిరిజనుల భూమి హక్కులు I ఆఫ్ 70 చట్టం పూర్వాపరాలు – వివరణ' అనే పుస్తకం సహాయంతో)